

# బర్బాద్ బంకర్

కార్గిల్ యుద్ధరంగం మంచు జ్వాలల్లో జ్వలిస్తోంది.

యుద్ధరంగానికి బాగా ఇవతల ఒక సైనిక శిబిరంలో కమాండర్ల సమావేశం జరుగుతోంది. నాగా, గఢ్వాల్, గ్రెనెడియర్ బెటాలియన్ కమాండర్లు, బ్రిగేడ్ కమాండర్ అధ్యక్షతన సమావేశమయ్యారు.

మే 14 (1999) న చొరబాటుదారుల సాహసాన్ని పసిగట్టిన 18 గ్రెనెడియర్ బెటాలియన్ యోధులు లోయను విడిచిపోవాల్సిందిగా శత్రువుల్ని పలుమార్లు హెచ్చరించారు.

ఆ హెచ్చరికల్ని హేళనచేస్తూ, శత్రువులు కవ్వింపు చర్యలుగా తూటాలు కురిపించారు. ఆగ్రహంతో గ్రెనెడియర్లు ఎదురు కాల్పులు జరిపారు. కానీ, పటిష్టమైన బంకర్లలో సురక్షితంగా తలదాచుకుంటున్న శత్రువులకు ఎలాంటి నష్టమూ వాటిల్లలేదు. అప్పుడు గానీ భారతసైన్యానికి పరిస్థితి తీవ్రత అర్థం కాలేదు.

తొలిదశలో కార్గిల్‌లోని 121 బ్రిగేడ్ కమాండర్ ఒకరు ప్రాథమిక సమాచారం ప్రకారం చొరబాటుదార్లు 8-10 మందికి మించి ఉండరని భావించి, గ్రెనెడియర్ కమాండింగ్ ఆఫీసర్‌తో "కొండ శిఖరం మీద నుంచి చొరబాటుదారుల్ని మెడపట్టి కిందకి తీసుకురండి" అని ఆదేశించారు.

మొత్తం యుద్ధంలో జరిగిన ఘోరతప్పిదం ఇదే!

కీలకమైన టోలోలింగ్ శిఖరం మీద నుంచి శత్రువులు శ్రీనగర్-లే రహదారి మీద నుంచి వెళ్తున్న భారత సైనిక ట్రక్కులను గురిచేసి పేల్చివేయనారంభించారు.

## కాటూరు రవీంద్రత్రివిక్రమ్

కేవలం దైవసహాయం వల్లనే కొన్ని ట్రక్కులు వాటిబారిన పడకుండా దాటి వెళ్లాయి.

కార్గిల్ యుద్ధరంగంలో గల ప్రముఖ శిఖరాలు టైగర్‌హిల్, టోలోలింగ్ పాయింట్ 5143. రాకీనాబ్, దిహరిప్ స్థావరాలు పాయింట్ 5143 కీ టోలోలింగ్ శిఖరానికీ మధ్య సురక్షిత బంకర్లతో శత్రువుల అధీనంలో ఉన్నాయి. పాకిస్థాన్ వైపు నుంచి ఈ శిఖరాలు ఎక్కడం సులభం. అవి అటువైపు ఏటవాలుగా ఉన్నాయి. భారత్‌వైపు నిట్టనిలువుగా ఉన్నాయి. వీటిని మొక్కవోని స్థైర్యంతో, పట్టుదలతో సైనికులు అధిరోహించారు.

ఒక్కొక్క సైనికుడు సుమారు 24 కిలోల సరంజామాను తన వెంట తీసుకువెళ్లాల్సి ఉంటుంది. అందులో ఉక్కు శిరస్త్రాణం (1.2 కిలో) ఇన్సాస్ (ఎస్ఎల్ఏ) రైఫిల్ (4.5 కిలోలు), ఆపద్ధర్మ ఆహారంగా బెల్లం ముక్కలు, పిండి, చాక్లెట్లు వగైరాలు (సుమారు 2 కిలోలు) కనీసం వంద తూటాలు (3.2 కిలోలు), పడక (2 కిలోలు), నీటి బుడ్డి (1.4 కిలో), ప్రత్యేక పరికరాలు (ఉలి, కొక్కేలు, తాడు వగైరాలు - 1 1/2 కిలోలు), పర్వత ప్రాంత దుస్తులు (క్రింది జాకెట్, ట్రవుజర్లు, థర్మల్ వెస్ట్‌లు, టోపీ, కళ్లద్దాలు, మంచులో వాడే బూట్లు - 7 1/2 కిలోలు).

ఇవికాక సైనికులు మరతుపాకులను, రాకెట్ లాంచర్లను, అవసరమైన మందుగుండునూ వంతులవారీగా తీసుకువెళ్లాలి.

మే 22 న గ్రెనెడియర్స్ తమ కార్యకలాపాలను ప్రారంభించినప్పుడు నెత్తురు వరదలై ప్రవ

హించింది. దీనితో తాము తలపడుతున్నది ఎలాంటి శత్రువుతో అన్నది దిగువున ఉన్న తక్కిన బెటాలియన్లకు కొంత తెలిసివచ్చింది. వీరికి రక్షణ కవచం అనేది లేనేలేదు. గుట్టల పొదవునా చొరబాటుదారులు బంకర్లు త్రవ్వు కుని, ఇనుప చట్రాలతో కోటలు కట్టుకున్నారు. వీరి కాల్పుల వల్ల సైనికులు ముందుకు వెళ్లటం అసాధ్యంగా మారింది. మరొక గ్రెనెడియర్ విభాగానికి చెందిన రెండు ప్లాటూన్‌లు టోలో లింగ్‌కు దిగువన ఉన్న వేరొక గుట్ట మీద 16 రోజులపాటు దిగ్బంధమైపోయారు. కొండ కొమ్ముల మీద నుంచి వీరి మీదకు శత్రువులు గురి చూసి కాల్చుగలుగుతున్న సమయంలో ఆత్మరక్షణే గగనమైంది.

ముందుకు కదలాలంటే – కృష్ణపక్షం రాత్రు ల్ని, ప్రతికూల్మ వాతావరణాన్నీ అడ్డంగా ఉం చుకునే వెళ్లాలి. తుపాకీ పేలిన శబ్దాలు గాలి రొదలో కలిసిపోవాలి. లేదంటే వాతావరణ ఉష్ణోగ్రత మైనస్ పదకొండు డిగ్రీలకు పతనం కావాలి. అలాంటి సమయంలో మాత్రమే సైని కులు ఎలాగో ఒకలాగా ముందుకు వెళ్లగలరు. దిగువున ఉన్న ప్రధాన సైనికస్థావరం నుంచి 16 వేల అడుగుల ఎత్తునగల ఈ శిఖరాలను చేరుకోవటానికి ఈ వాతావరణానికి అలవాటు పడిన బలిష్ఠుడైన వ్యక్తికి పదకొండు గంటల సమయం పడుతుంది.

అయితే శత్రువు కురిపిస్తున్న తుపాకీ గు ళ్లకు ఎదురీదుతూ అంగుళం అంగుళం చొప్పు న కొండవాలు మీద పాకుతూ ముందుకు వెళ్ల టం మృత్యువుకు ఎదురీదడమే!

'బర్‌బాద్ బంకర్'గా పిలువబడిన శత్రు స్థావరం టోలోలింగ్ శిఖరానికి వెళ్లే దారిలో ఉంది. అది ఒక చిన్న శిఖరం మీద పకడ్బం

సిపాయిలు దేశమాతకి ముద్దు పాపాయిలు. ప్రాణాలను పణంగా పెట్టి, మన సరిహద్దుల్ని సదా రక్షిస్తుంటారు. వారి వీరగాథలు యువతకి ఆదర్శం, స్ఫూర్తిదాయకం కావాలి.

ఈ కథలు వాస్తవ సంఘటనల నేపథ్యంతో రచించబడ్డాయి. రచయిత శ్రీ కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ 1964 నుంచి 1980 వరకు వైమానిక దళంలో పనిచేసిన కాలంలో స్వయంగా రెండు యుద్ధాలలో పాల్గొన్నారు. మిలట్రీ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న అనేక మంది యుద్ధవీరుల విజయగాథల గురించి వివరాలు సేకరించారు. యుద్ధరంగం వేదికగా, దేశభక్తి ఊపిరిగా, త్రివిధ దళాల యుద్ధవీరులు సజీవ పాత్రలుగా వెలువడు తున్న ఈ కథలు 'కథాకేళి' పాఠకులకు ప్రత్యేకం.

దీగా నిర్మితమై ఉంది. అక్కడ నుంచి కురుస్తున్న తూటాల వర్షానికి చాలా మంది భారత జవాను లు వీరస్వర్గమలంకరించారు. దాంతో ఆ బంక ర్‌ని గట్టిగా దెబ్బతియ్యడానికి రంగం సిద్ధమ యింది. టోలోలింగ్ శిఖరానికి గురిపెట్టి దాదా పు 120 బోఫోర్స్ ఫిరంగుల్ని మోహరించారు.

ఈ ఫిరంగుల్ని అతి కష్టం మీద విడిభాగాల రూపంలో, వివిధ పద్ధతులలో యుద్ధరంగానికి చేర్చారు. అత్యవసరం కాబట్టి, అధిక మూల్యం చెల్లించి, సమృద్ధిగా ఫిరంగి గుళ్లను కొనుగోలు చేసి, అక్కడకు చేర్చారు. అవి పదివేలకు పైగానే ఉన్నాయి. వాటిలోంచి కనీసం పదివేల గుళ్లను (ఇది 50,000 కిలోల టి.ఎన్.టి.కి సమానం) బోఫోర్స్ ఫిరంగుల ద్వారా టోలోలింగ్ శిఖరాల మీదకు ప్రయోగించారు. ఈ పేలుడు పదార్థం తో న్యూఢిల్లీ వంటి నగరాన్ని చాలావరకూ ధ్వం సం చేయవచ్చు.

బోఫోర్స్ దాడి దెబ్బకి భారత జవాన్లను చికాకు పరిచిన పటిష్ఠమైన శత్రు స్థావరం 'బర్ బాద్ బంకర్' (నాశనమైన స్థావరం)గా మారి

పోయింది.

ఇక సైనికులు ముందుకు వెళ్లి దాడి చేయటానికి పథకం ప్రారంభమయింది. సైనిక బృందాలకు మహాభారతంలోని భీమ్, అర్జున్, అభిమన్యు - వంటి వీరుల పేర్లు సంకేతాలుగా పెట్టారు.

రాజ్‌పుతానాకి చెందిన లెఫ్టినెంట్ వైజయంత్, హిందీ సినిమా 'బోర్డర్' లోని ఉత్తేజకరమైన పాటల్ని టేప్‌రికార్డర్ ద్వారా సైనికులకు వినిపిస్తూ వారిని సమర సన్నద్ధులను చేసారు.

శతఘ్నుల కాల్పులు ఆగిన వెంటనే సైన్యం తన దాడిని ప్రారంభించింది. ఒకరు నేరుగా పైకి ఎగబ్రాకగా, మరి కొందరు శత్రువు వెనక్కి మళ్లినా ఎదుర్కొనేందుకు వలయాకారంలో ముందుకు సాగారు. గ్రెనెడియర్ల బృందం ఒకటి మంచుపులుల్లా ముందుకి సాగింది.

ఫిరంగి గుళ్లతో ఏర్పడిన గుంతలను భారతీయ సైనికులు తమ తలదాచుకోవటానికి వినియోగించుకున్నారు. కొన్ని చోట్ల వారు తమకు ఆధారంగా ఒంటి చేత్తోనే రాళ్లను పట్టుకున్నారు. వారు పైకి ఎగబాకుతున్న కొద్దీ పైనుంచి మళ్లీ కాల్పులు ప్రారంభమైనాయి. అంటే - శత్రువులు ఎంత పటిష్ఠమైన స్థావరాల్లో తల దాచుకున్నదీ ఊహించుకోవచ్చు. పదివేల బోఫోర్స్ శతఘ్నుల గుళ్లకు కూడా వాళ్లు చలించలేదు! పదులు, వందల సంఖ్యలో ఉన్న శత్రువుల్ని మట్టుబెట్టటానికి మనం వేల సంఖ్యలో (నాలుగు డివిజన్లు) సైనికుల్ని వినియోగించాల్సి వచ్చిందంటే యుద్ధరంగం ఎంత ప్రతికూలంగా ఉన్నదీ గ్రహించవచ్చు. 1965 నాటి పాక్ యుద్ధంలో 'హాజీపీర్' కనుమను పట్టుకునేందుకు పడిన కష్టంతో దీనిని పోల్చవచ్చు. అప్పట్లో ఆ యుద్ధం 32 రోజులపాటు సాగిన నరకం. ప్రస్తుత యుద్ధంలో కీలకమైన శిఖరాలు పట్టుకోవటానికి నెల రోజులకు పైగానే సంఘర్షణ జరుగుతోంది.

కార్గిల్ శిఖరాలను ఎక్కే సమయంలో సైనికులు మోసే ప్రతి గ్రామూ అదనపు భారమే! ఇటు తిండి పదార్థాలు, అటు మందుగుండు



*టోలోలింగ్ శిఖరాగ్రానికి చేరుకునేందుకు గుట్టల చాటున నక్కుతూ ముందుకు వెళుతున్న భారతీయ సైనికులు.*



'బర్‌బాద్ బంకర్' మీద ఫిరంగి గుళ్ల వర్షం కురిపిస్తున్న బోఫోర్స్ ఫిరంగులు

– ఈ రెండింటిలో ఏది ఎంత కావాలనేది జాగ్రత్తగా నిర్ణయించుకోవాల్సి ఉంటుంది. రెండు కిలోల ఆహార పొట్లం వంద తూటాలకు సమానం. చాలామంది సైనికులు ఆహారం కన్నా బుల్లెట్లనే ఎంచుకుంటారు.

జూన్ (1999) 2 వ తేది –


రాత్రి సమయం.

గ్రెనెడియర్స్ చొరబాటుదార్లపై తమ నాల్గవ దాడి సాగించారు. ఇది కూడా మునుపటి మాదిరి భీకరమైనదే. ఇంతవరకూ భారతసైన్యం ఎక్కువ ప్రాణ నష్టాలు పొందుతోంది. మోర్టార్లను, ఫిరంగుల్ని ప్రయోగించి, శత్రు స్థావరాలను పేల్చివేసి, వాటిని తమ అదుపులోకి తెచ్చుకోవటం అనుకున్నంత సులభంగా జరగటం లేదు. కారణం – పటిష్ఠమైన వాటి నిర్మాణం.

'టోలోలింగ్'ని స్వాధీనం చేసుకోవటానికి మన సైన్యం చేసిన అనేక ప్రయత్నాలను శత్రువులు ఎదురు కాల్పులతో భగ్నం చేసారు. భారత సైన్యపు పట్టుదల మరింత పెరిగింది.

తర్వాత తొమ్మిది రోజుల్లోనూ మరో ఎనిమిది బ్యాటరీలను (ప్రతి బ్యాటరీలోనూ ఆరు బోఫోర్స్ హోవిట్జర్లు, మధ్య తరహా గన్‌లుంటాయి.) తెప్పించుకోవటం ద్వారా సైన్యం తన ఫిరంగి దళ సామర్థ్యం పెంచుకుంది. జూన్ 12 న తుది దాడి మొదలు పెట్టటానికి ఒక వారం ముందు అచ్చం టోలోలింగ్ శిఖరం మాదిరిగానే ఉన్న మరొక శిఖరం మీద ప్రాక్టీసు దాడి చేసాయి. తర్వాత ఇసుకతో, మట్టితో, రాళ్లతో, టోలోలింగ్ నమూనా శిఖరాన్ని రూపొందించి, దాడి చేయటానికి ఉపయోగించాల్సిన వివిధ మార్గాలను అధ్యయనం చేసి, పథకాలు రచించారు. ప్రయోగం చేసిన సమయంలో – చాలా కాలం నిల్వ ఉంచిన మందుగుండులో పనికిరాని గ్రెనేడ్లను గుర్తించి, అవతల పారేసారు. కొండల మీదకి పెద్ద మొత్తంలో మందుగుండు సామాగ్రిని చేరవేయటంలో సైనిక దళానికి చెందిన రజకులు, చర్మకారులు, క్షురకులు – ఒక్కో సైనికుడికీ నలుగురు చొప్పున సహాయపడ్డారు.

టోలోలింగ్ శిఖరాన్ని పట్టుకునేందుకు సాహసించిన వీరులలో కెప్టెన్ సచిన్ నింబాల్కర్, కల్నల్ రవీంద్రనాథ్, మేజర్ గుప్తా, జె.సి.వో. భన్వర్ సింగ్, 23 సంవత్సరాల వయస్సు గల లెఫ్టినెంట్ పర్వీణ్‌తోమార్ (ఈయన్ని బేబీ ఆఫ్ ది బెటాలియన్ అని పిలిచేవారు) చెప్పుకోదగిన వారు. మరెందరో సిపాయిలు... వారి పేర్లు




మంచుకొండల గుండెల్లో పదిలంగా ఉన్నాయి.

మేజర్‌గుప్తా, జె.సి.వో. భన్వర్‌సింగ్, వారి ఆరుగురు సహచరులు యుద్ధరంగంలో వీర స్వర్గమలంకరించారు. వారి సాహసగాధలకు ఆ కొండలే శాశ్వత సాక్షులు.

ఎట్టకేలకు 'టోలోలింగ్ శిఖరం' భారత సైనికుల వశమైంది.

అది కీలక విజయమని చెప్పితీరాలి. ఆ విజయోత్సాహంలో సిపాయిలు ఉల్లాసంతో కేరింతలు కొడ్తూ, తమ ఆయుధాలను గాల్లోకి ఎత్తి పట్టుకుని ఆనందం పంచుకున్నారు.

టోలోలింగ్ శిఖరం మన వశం కావడం తో, దానికి చుట్టు పక్కలనున్న శిఖరాలపై తిష్ఠ వేసిన చొరబాటుదారుల నుంచి ప్రతిఘటన బలహీనపడింది.

జూన్ 13 నాటికి టోలోలింగ్‌కి ఆగ్నేయం గా సుమారు 100 మీటర్ల దూరంలో ఉన్న 'బర్బాద్ బంకర్' ని, పాయింట్ 4590 శిఖరాన్నీ రాజ్‌పుతానా రైఫుల్స్ తమ స్వాధీనంలోకి తెచ్చుకుంది.

జూన్ 14 నాటికి గ్రెనెడియర్స్ శిఖరాగ్రానికి చేరుకున్నారు. ఆ తర్వాత మూడు రోజుల్లో మిగతా శిఖరాలు మన వశమైనాయి. మృతుల్లో 50 మంది చొరబాటుదార్లు కాగా, మిగిలిన వారు పాకిస్థాన్ ఉత్తరపదాతి దళానికి చెందిన వారు.

శత్రు స్థావరాల్లో సమృద్ధిగా నిల్వ ఉంచిన నెయ్యి, డబ్బాల్లో భద్రపరచిన అనాస పళ్లు, తేనె, వెన్న ప్యాకెట్లు మన సైనికుల విజయోత్సవానికి విందుగా ఉపకరించాయి.

ఇప్పుడు ఆ స్థావరాల్లో మన సైనికులు అప్రమత్తంగా పహరా కాస్తున్నారు. యుద్ధం చాలా పాఠాలు నేర్పుతుంది. అయితే వాటిలో కొన్ని ఖరీదయిన పాఠాలుంటాయి.

(ఇండియా టుడే సౌజన్యంతో...)